



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 301 | మంగళవారం 19 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## కేరళం సీఎంగా వీడీ సతీషన్ ప్రమాణ స్వీకారం

**- 20 మంది మంత్రులు కూడా..**

**ఖర్గే, రాహుల్, రేవంత్ హాజరు**

**- కేరళంలో కొలువుదీరిన యూడీఎఫ్ ప్రభుత్వం**

తిరువనంతపురం– సూర్య వాస్తవం

కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. అయితే సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వచ్చారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం

- మిగతా 2లో..

## ఈ పర్యటనలు దేశం కోసమేనా?



**- మోడీతో సంబంధాల వల్ల లబ్ది పొందింది అదానీ గ్రూపే**

**- భారత్‌కు దక్కిన ప్రతిఫలం ఏమీలేదు**

**- కొన్ని చోట్ల ప్రతికూల ఫలితాలు**

న్యూఢిల్లీ– సూర్య వాస్తవం

ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే వారం యూరోపియన్ యూనియన్ దేశమైన నార్వేలో పర్యటించబోతున్నారు. నార్వేలో భారత ప్రధాని పర్యటించడం 43 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అవినీతి ఆరోపణల కారణంగా నార్వేకు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ తన పెట్టుబడుల పరిధి నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీని తప్పించింది. మోడీ నార్వే పర్యటనకు ఇది కారణమా అన్న అనుమానాలను అక్కడి పరిస్థితులను గమనిస్తున్న వారు వ్యక్తం చేశారు. అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి ఆరోపణలను అమెరికా ఎత్తివేసిన నేపథ్యంలో ప్రధాని వాటిని తక్కువ చేసి చూపేందుకు ఈ పర్యటనను ఉపయోగించుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం, అదానీ గ్రూప్ పరస్పరం ఎలా సహకరిం చుకుంటున్నాయో సమీక్షించేందుకు ఈ ఉదంతం ఓ అవకాశాన్ని కల్పిస్తోంది. మన దేశంలో రాజకీయాలు, వ్యాపారం ఒక దానితో ఒకటి పెన వేసుకుపోవడం 1991 తర్వాత ఊపందుకుంది. ఆ తర్వాత కొద్ది మంది సంపన్నులు ఈ సంబంధాలకు వ్యక్తిగత రూపాన్ని ఇచ్చారు. వీరిలో అత్యంత విజయవంతమైన వ్యక్తి గౌతమ్ అదానీ. ఆయన కనీసం పాతిక సంవత్సరాలుగా నరేంద్ర మోడీతో సన్నిహిత సంబంధాలను పెంచుకున్నారు. అయితే ఈ సంబంధం విదేశాలలో భారత్‌కు ఏమైనా ఉపయోగపడిందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

**బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరాలో...**

ప్రధాని నరేంద్ర మోడీ పలు దేశాలో అధికారిక పర్యటనలు జరపడం, ఆ తర్వాత అదానీ గ్రూపు ఆయా దేశాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం తెలిసిందే. ఈ ప్రాజెక్టుల కారణంగా అదానీ గ్రూపు సహజంగానేలబ్ది పొందింది. ఉదాహరణకు 2015 జూన్‌లో మోడీ బంగ్లాదేశ్‌లో పర్యటించారు. విద్యుత్ సరఫరా పొందడంలో ఆ దేశం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి సాయం చేస్తానని అప్పటి ప్రధాని షేక్ హసీనాకు ఆయన హామీ ఇచ్చారు. ఆ తర్వాత రెండు నెలలకు అదానీ గ్రూప్, బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు ఓ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం జార్ఖండ్‌లోని ఓ థర్మల్ ప్లాంటు నుంచి బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. 2017లో హసీనా మన దేశంలో పర్యటించినప్పుడు ఈ ప్రాజెక్ట్ అమలుకు ఆమోదముద్ర పడింది.

**కొలంబో పోర్టు అభివృద్ధిలో...**

ఇప్పుడు శ్రీలంక విషయానికి వద్దాం. శ్రీలంకను 60 బిలియన్ డాలర్ల రుణభారం నుంచి బయటపడేసే విషయం గురించి చర్చించడానికి, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం 400 మిలియన్ డాలర్ల రుణ సదుపాయం కోరడానికి ఆ దేశ ప్రధాని మహింద్ర రాజపక్సే 2020 ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో మోడీతో సమావేశమయ్యారు. కొలంబో పోర్టును అభివృద్ధి చేయాల్సిందిగా శ్రీలంక ప్రభుత్వం

- మిగతా 2లో..



## ఉగ్రవాదంపై పోరుకు నార్వే బాసట

**-- ప్రధాని మోడీ కృతజ్ఞతలు**

**-- సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలి**

**-- సైనిక చర్యలు పరిష్కారం కాదని ఉద్ఘాటన**

**-- అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవశ్యం**

2లో



## మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి లేదు

**- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

2లో



## ఓయూపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి

**- ఇప్పటికే రూ.వెయ్యి కొట్ల కేటాయింపు..**

**- నేడు సీఎం నాన్ నెట్ ఫెలోషిప్స్**

**- సింగరేణి సహకారంతో 143 మంది పరిశోధకులకు ఆర్థిక చేయూత**

**- నెలకు రూ.5 వేల చొప్పున 3 ఏండ్లు ఫెలోషిప్స్**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఓయూ పూర్వ వైభవం కోసం రూ.1000 కోట్ల నిధులు ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు పరిశోధనలపై ఆసక్తి ఉన్న ఆర్థికంగా

- మిగతా 2లో..

## నిశ్చితార్థానికి వెళ్తుండగా ప్రమాదం 12 మంది మృతి

**- 20 మందికిపైగా గాయాలు**

**- ముంబయి-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఘోరం**

పాల్ఘర్ - సూర్య వాస్తవం



మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళు_న్న ఓ ట్రక్కు, కంటైనర్ ఢీకొని 12 మంది దుర్మరణం చెందారు. మరో 20 మందికిపైగా గాయపడ్డారు. ముంబయి–అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. నిశ్చితార్థ వేడుకకు హాజరయ్యేందుకు బంధువులు, అతిథులతో ఓ ట్రక్కు ప్రయాణిస్తుండగా వేగంగా వచ్చిన కంటైనర్ దాన్ని ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి పలువురు ప్రయాణికులు వాహనాల మధ్య చిక్కుకుపోయారు. సమాచారం

- మిగతా 2లో..



## బండి భగీరథ్‌పై మరో సెక్షన్ ..!

**- కేసును నీరుగార్చే యత్నం ....**

**- బాధితురాలిచ్చిన వివరాలకు.. పోలీసులు నమోదు చేసిన కేసులకు పొంత లేదు .....**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బిఎన్ఎస్ 64 (2) (వీ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ ను దర్యాప్తు అధికారులు జతపరిచారు. ఈ సెక్షన్ ప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు.

**కేసును నీరుగార్చే యత్నం ....**

మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ .... ఈ నెల 8న బాధితురాలైన ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బిఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా పోలీసులు ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

## గడువులోగా ప్రాజెక్టులు..

**- పోలవరం ఎడమ కాల్వ చంపావతి లింక్ పై అధ్యయనం**

**- జలవనరుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు**

అమరావతి - సూర్య వాస్తవం



నిర్ధేశిత గడువులోగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో జలవనరులశాఖ, పోలవరం ప్రాజెక్టుల పనులపై సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టడంతోపాటు ప్రాధాన్యతా క్రమంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. . ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా వాటికి మరో 11 ప్రాజెక్టులను చేరుస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులను

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### కేరళం సీఎంగా

# వీడీ సతీషన్

## ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ హాజరయ్యారు.

**20 మంది మంత్రులు ప్రమాణం**

సతీశన్తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కట్టఎం షాజీ, పీకట్ట బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళం ముఖ్యమంత్రి ఎవరనే దానిపై 11 రోజులపాటు ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొన్నా..కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది.

**న్యాయవాది టు సీఎం**

కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. పదేండ్లు కేరళం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళం విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేండ్లుగా కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.కేరళం ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేండ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు.

### ఉగ్రవాదంపై పోరుకు

## నార్వే బాసట

**- ప్రధాని మోడీ కృతజ్ఞతలు**

**-- సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలి**

**-- సైనిక చర్యలు పరిష్కారం కాదని ఉద్ఘాటన**

**-- అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవశ్యం**

**ఓస్లో – సూర్య వాస్తవం**

ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి నార్వే మద్దతునిచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలియచేశారు. అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు నిబద్ధతతో పనిచేయాలని ఇరు దేశాలు సోమవారం నిర్ణయించాయి. నార్వేలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో తలెత్తిన ఘర్షణలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని, మిలటరీ చర్చల ద్వారా కాదని ఈ సందర్భంగా మోడీ స్పష్టం చేశారు. వాణిజ్యం, ఇంధనం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి చర్చలు జరిపేందుకు, ఇరు దేశాల మధ్య సంబంధాలకు మరింత వూతమివ్వడానికి ఈ పర్యటన ఉద్దేశించబడింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. నార్వే ప్రధాని జోనాస్ గర్ స్టోర్‌తో మోడీ సోమవారం చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య గల సంబంధాలను హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్ళాలని ఇరు దేశాలు ఆదివారం అంగీకరించాయి. ఈ సందర్భంగా పునర్వినియోగ ఇంధనం, సముద్ర జలాల ఆర్థిక వ్యవస్థ, సముద్ర జలాల్లో భద్రత, వాతావరణ సహకారం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టారు. ఇండో–పసిఫిక్ చొరవలో నార్వే కూడా చేరుతోందని అన్నారు. ఇరు దేశాలు కలిసి సముద్ర జల ఆర్థిక వ్యవస్థలను, భద్రతను, సామర్థ్యాల పెంపును బలోపేతం చేసుకుంటామని చెప్పారు. అలాగే నార్వే రాజు కింగ్ హెరాల్డ్–5, రాణి సోంజాలతో కూడా మోడీ భేటీ అయ్యారు.

రెండు రోజులు జరిగే ఈ పర్యటనా కాలంలో నార్డిక్–భారత్ 3వ సదస్సు కూడా జరగనుంది. నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఐస్‌ల్యాండ్, డెన్మార్క్ నేతలను ఒక తాటిపైకి తీసుకువచ్చేందుకు మంగళవారం జరిగే ఈ సదస్సు పహల్గాం ఉగ్రదాడి కారణంగా గతేడాది రద్దయింది. దార్శనికతతో కూడిన ప్రధాని మోడీ నాయకత్వానికి, భారత్, స్వీడన్ మధ్య సంబంధాలకు ఆయన చేసిన విశేష కృషికి గానూ రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్ అవార్డును మోడీకి బహుకరించారు.

**అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవశ్యం**

అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించాంటే అంతర్జతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావడం అత్యంత అవశ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. మీడియాతో మోడీ మాట్లాడుతూ, ఏ సమస్యకైనా పరిష్కారం మిలటరీ ఘర్షణల్లో దొరకదని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో శాంతి దిశగా వేసే ప్రతి అడుగుకు తమ మద్దతు వుంటుందని చెప్పారు. వాణిజ్యానికి సంబంధించి భారత్, యూరప్‌లు స్వర్ణ శకంలోకి ప్రవేశిస్తున్నాయని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలే ఇందుకు కారణమన్నారు.

### మోడీ ప్రభుత్వానికి

## దూరదృష్టి లేదు

**- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు దేశ ఆర్థిక వ్యవస్థ గురించి దాచిపెట్టిందని ఖర్గే ఆరోపించారు. ఆదివారం వాహనాలకు వినియోగించే గ్యాస్ ధరను కిలోకి రూపాయి మేర కేంద్రం పెంచింది. కేవలం ఒక్క వారంలోనే సిఎన్‌జి గ్యాస్ ధర పెంచడం రెండోసారి కావడం గమనార్హం. మొత్తంగా సిఎన్‌జి గ్యాస్ ధర కిలోకి మూడు రూపాయల చొప్పున పెరిగిన నేపథ్యంలోనే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు గనుక ప్రధాని మోడీ పెట్రోల్, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ఉంటే.. ఆయన గణనీయమైన నష్టాలను చవిచూసేవారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల వరకు అన్ని విషయాలను దేశానికి తెలియకుండా దాచిపెట్టింది. కానీ ఎన్నికలు ముగియగానే అన్నింటి ధరలను పెంచేసింది. అసలు మోడీ ప్రభుత్వానికి దూరదృష్టి లేదు. అందుకే వారు ధరల పెరుగుదలను ముందుగా ఊహించలేకపోయారు. బిజెపి ప్రభుత్వం కారణంగానే ద్రవ్యోల్బణం నిరంతరం పెరుగుతుంది. ఈ విషయాన్ని మేము లేవనెత్తుతాము. దేశంలోని పేదలు ధరల పెరుగుదలతో వారికి అవసరమైన నిత్యావసర వస్తువుల్ని కూడా పొందలేకపోతున్నారు అని ఖర్గే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో విమర్శించారు.

# ఈ పర్యటనలు దేశం కోసమేనా?

(మొదటిపేజీ తరువాయి)

అదానీ గ్రూపును కోరింది. శ్రీలంక ఓడరేవుల అథారిటీతో (ఎస్ఎల్‌పీఏ) ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అదానీ 2021 అక్టోబరులో అధ్యక్షుడు గొటబాయ్ రాజపక్సే, ప్రధాని మహింద్ర రాజపక్సేలను కలిశారు.

**నేపాల్ విమానాశ్రయాల నిర్మాణంలో...**

నేపాల్ విషయానికి వస్తే పొఖారా, భైరాహవా విమానాశ్రయాలను చైనా నిర్మించడంపై భారత ప్రభుత్వం కాట్మండులోని అధికారుల వద్ద ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాక ఆయా విమానాశ్రయాలకు వెళ్లే విమానాలు తక్కువ ఎత్తులో ప్రయాణించడంపై ప్రభుత్వం నిషేధించినట్లు తెలిసింది. ఏదేమైనా విమానాశ్రయాల నిర్మాణం ఆగిపోయింది. విమానాశ్రయాల నిర్వహణను అదానీకి అప్పగిస్తేనే పరిస్థితి చక్కబడుతుందని ఓ నేపాలీ వార్తా పత్రిక రాయడం ఈ సందర్భంగా గమనార్హం. 2023 జూన్‌లో భారత్, నేపాల్ ప్రభుత్వాల మధ్య దీనిపై చర్చలు జరిగాయి. 2024 జనవరిలో నేపాల్ ఆర్థిక మంత్రి గుజరాత్ వచ్చి అదానీ గ్రూపుతో చర్చించారు. ఈ చర్చల ఫలితంగా ఆ రెండు విమానాశ్రయాలతో పాటు భారత్–నేపాల్ సరిహద్దులో ఉన్న బారా ఎయిర్‌పోర్టును కూడా అదానీ గ్రూప్ చేపట్టాలని నిర్ణయించారు.

**తూర్పు ఆఫ్రికాలో కూడా...**

తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో కూడా అదానీ గ్రూపు భారత ప్రభుత్వంతో కలిసి పనిచేసింది. 2015లో టాంజానియాలోని బగమోయోలో ఓడరేవును నిర్మించాలని చైనా ప్రతిపాదించగా మోడీ, అదానీ వ్యతిరేకించారు. 2016లో మోడీ దార్ ఏ సలామ్‌లో పర్యటించారు. 2019లో చైనీయులు బగమోయో ప్రాజెక్టు నుంచి వైదొలిగారు. 2023లో టాంజానియా అధ్యక్షురాలు సమీయా సులుహు హసన్ మన దేశంలో పర్యటించారు. 2024 మేలో డార్ ఏ సలామ్ ఓడరేవులోని ఓ టెర్మినల్ నిర్వహణ కోసం టాంజానియా అధికారులతో అదానీ గ్రూప్ 30 సంవత్సరాల రాయితీ ఒప్పందంపై సంతకం చేసింది. కెన్యాలో కూడా ఇలాగే జరిగింది. 2023 డిసెంబర్ ఐదవ తేదీన మోడీతో కెన్యా అధ్యక్షుడు విలియం రూటో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా అదానీని మోడీ ఆయనకు పరిచయం చేశారు. ఆ మరుసటి సంవత్సరమే నైరోబీ విమానాశ్రయాన్ని ఆధునీయకరిస్తానని కెన్యాకు అదానీ ప్రతిపాదించారు. ఆ తర్వాత కెన్యా ప్రభుత్వం బిడ్లను ఆహ్వానించి అదానీకి ఆ కాంట్రాక్టును అప్పగించింది.

**గ్రీస్ ఓడరేవులలో అదానీ వాటాలు**

భారత్'మధ్యప్రాచ్యం'యూరప్ కారిడార్‌లో ఐరోపాకు ముఖద్వారాలలో ఒకటిగా ఉన్న గ్రీస్‌లో పాగా వేయడానికి భారత ప్రభుత్వం అదానీ గ్రూపుపై ఆధారపడే అవకాశం ఉంది. 2023 ఆగస్టులో మోడీ గ్రీసులో పర్యటించారు. ఆ దేశంలోని ఓడరేవులలో వాటాలు కొనుగోలు చేయాలన్న అదానీ గ్రూప్ ప్రణాళికలు ఈ సందర్భంగా గ్రీస్ ప్రధానితో మోడీ జరిపిన సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి.

**ఇజ్రాయిల్‌తో సంబంధాలు బలోపేతం**

ఇజ్రాయిల్‌తో భారత్ సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో కూడా అదానీ గ్రూపు ప్రయోజనాలే కనిపిస్తాయి. 2017లో మోడీ టెల్ అవీవ్‌లో పర్యటించినప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు కొత్త మలుపు తీసుకున్నాయి. 2018లోఇజ్రాయిల్‌తో సంబంధాలు బలోపేతం అదానీ గ్రూప్, ఇజ్రాయిల్ ఆయుధ తయారీ సంస్థ ఎల్బిట్ సిస్టమ్స్ కలిసి హెర్మెస్ 900 యూఏవీ అనే డ్రోన్‌ను ఉత్పత్తి చేయడానికి ఉమ్మడి భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ డ్రోన్లను 2022 తర్వాత గాజాలో ఉపయోగించారు. 2022 జూన్‌లో హైఫా పోర్ట్ ప్రైవేటీకరణ ప్రక్రియను ప్రారంభించిన ఇజ్రాయిల్ ప్రభుత్వం...70 శాతం వాటాతో అదానీ గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం కాంట్రాక్టును దక్కించుకున్నదని ప్రకటించింది. 2024 సెప్టెంబరులో అదానీ గ్రూప్, ఇజ్రాయిల్‌కు చెందిన టవర్ సెమీకండక్టర్ గ్రూప్ కలిసి సెమీకండక్టర్ల ఉత్పత్తిలో ఉపయోగించే విడిభాగాల తయారీకి ఉమ్మడి భాగస్వామ్యాన్ని నెలకొల్పుకున్నాయి. సెమీకండక్టర్ల ఉత్పత్తికి మోడీ ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే.

**అవినీతి ఆరోపణలతో ఒప్పందాలు రద్దు**

మోడీ ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య నెలకొన్న సహకారం ఇజ్రాయిల్ వంటి కొన్ని దేశాలతో భారత్ సంబంధాల బలోపేతానికి దోహదపడింది. అయితే కొన్ని సందర్భాలలో మిశ్రమ ఫలితాలు రాగా మరికొన్ని చోట్ల ప్రతికూల ఫలితాలు కూడా వచ్చాయి. అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి ఆరోపణల కారణంగా అనేక ప్రభుత్వాలు దానితో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. శ్రీలంకలో రాజపక్స స్థానంలో అధ్యక్షుడిగా ఎన్నికైన దిశనాయకే అదానీ గ్రూపుతో అంతకుముందు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేశారు. విండ్ టర్బైన్ల ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్తుకు అధిక ధర వసూలు చేయాలన్న అదానీ గ్రూప్ ప్రణాళికను సవాలు చేస్తూ శ్రీలంక కోర్టులో పిటిషన్ దాఖలైంది. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వ పతనం తర్వాత ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం కూడా అదానీ గ్రూపుతో గతంలో కుదుర్చుకున్న కాంట్రాక్టును రద్దు చేసుకుంది. కెన్యాతో అదానీ గ్రూప్ కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ రద్దయ్యాయి. ఆస్ట్రేలియాతో అదానీ గ్రూప్ కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా భారత్‌కు అపార నష్టం వాటిల్లింది. ఏదేమైనా మోడీ ప్రభుత్వంతో సంబంధాల కారణంగా అదానీ గ్రూపు లాభపడిందే తప్ప దానితో సంబంధాలతో భారత్‌కు ఒరిగిందేమీ లేదనే చెప్పాలి.

### ఓయూపై సీఎం రేవంత్

## ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

వెనుకబడిన విద్యార్థులకు "సీఎం నాన్–నెట్ ఫెలోషిప్స్" ద్వారా చేయూత అందించడానికి ఏర్పాట్లు చేసింది. ఓయూలోని 12 డీన్స్ పరిధిలో పరిశోధనలు చేస్తున్న కేటగిరీ–2 పీహెచ్‌డీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి నాన్–నెట్ ఫెలోషిప్ పథకాన్ని ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించారు. అర్హత సాధించిన 143 మంది పరిశోధక విద్యార్థులకు నెలకు రూ.5 వేల చొప్పున మూడు ఏండ్ల పాటు ఉపకార వేతనాలు అందించే ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి కాలరీస్ లిమిటెడ్.. ముఖ్యమంత్రి పేరుతో ఫెలోషిప్స్ అందించేందుకు రూ.కోటి విరాళం అందజేసింది. సుమారు 200 మంది పరిశోధక విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పరిశోధనలు పూర్తి చేయాలని, ఓయూ విద్యార్థులు అంతర్జాతీయ గుర్తింపు కలిగిన పరిశోధనా పత్రాలను ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఓయూ అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

**అదనపు కంటింజెన్సీ నిధులు**

సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్న విద్యార్థుల కు ఉపకార వేతనాలకు అదనంగా ఏటా రూ.6 వేల చొప్పున, సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాల పరిశోధ నలకు రూ.8 వేల చొప్పున కంటింజెన్సీ నిధులు అందిం చనున్నట్టు ఓయూ వీసీ తెలిపారు. ఈ పథకాల కోసం ఏటా మొత్తం రూ.1.32 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగించుకోవాలని సూచించారు.

**వీసీ చొరవతోనే సాధ్యమైంది– రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి**

సీఎం నాన్–నెట్ ఫెలోషిప్స్ పొందే విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి పరిశోధన పురోగతి నివేదిక సమర్పించాలని సూచించారు.

ఇతర ఫెలోషిప్స్ పొందుతున్న విద్యార్థులు ఈ పథకానికి అనర్హులని, పరిశోధనతోపాటు కనీసం రెండు పబ్లికేషన్స్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో నాన్–నెట్ ఫెలోషిప్స్ అందిస్తున్న తొలి యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీనే అని రిజిస్ట్రార్ తెలిపారు. 2025లో అర్హులైన ప్రతి విద్యార్థికీ ఫెలోషిప్స్ అందించామరని చెప్పారు.

త్వరలోనే పీహెచ్‌డీ కేటగిరీ–2 నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఇటీవల కేటగిరీ–1లో 366 ఖాళీలకు పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరం పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ ప్రత్యేక చొరవతోనే ఇవ్వన్నీ సాధ్యం అవుతున్నట్టు చెప్పారు.

### నిశ్చితార్థానికి వెళ్తుండగా ప్రమాదం

## 12 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. క్షత గాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. శుభకార్యానికి వెళ్తుండగా ఊహించని విధంగా జరిగిన ఈ ప్రమాదంతో బాధిత కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకొన్నాయి.

**ప్రమాదం ఇలా..** బాపుగావ్ ఖడ్కిపాడ గ్రామానికి చెందిన బలరామ్ జైరామ్ దండేకర్ నిశ్చితార్థ వేడుకకు సుమారు 100 మందికి పైగా ప్రయాణికులు ఓ ట్రక్కులో బయలుదేరారు. దహను తాలూకాలోని ధనివారి గ్రామం సమీపంలోకి రాగానే పశువులతో వెళ్తున్న ఓ కంటైనర్ వీరి వాహనాన్నిను ఢీకొట్టింది. దీంతో 12 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. పలువురు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదం ధాటికి ట్రక్కు, కంటైనర్ రెండూ అక్కడి కక్కడే బోల్తా పడ్డాయి. ఫలితంగా పలువురు ప్రయాణికులు వాహనాల కింద చిక్కుకు పోయారు. అయితే, టెంపో దాని సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకువెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అతివేగం, ఇరుకైన రహదారి, టెంపో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన తర్వాత వాహనాల శిథిలాల నుంచి బాధితులను బయటకు తీయడానికి స్థానికులు, పోలీసు సిబ్బంది, సహాయక బృందాలు శ్రమించాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**రెండు నెలల చిన్నారి సహా ఏడుగురు మృతి**

ఇదిలా ఉండగా, బిహార్‌లోని ఖగారియా జిల్లాలోని జాతీయ రహదారి–31పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రక్కు– ఆటో ఢీకొన్న ప్రమాదంలో రెండు నెలల చిన్నారితో సహా ఏడుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. వేగంగా వస్తున్న ట్రక్కు, ఆటో రిక్షాను ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. "ఈ ప్రమాదంలో రెండు నెలల పసికందుతో పాటు ఒక మహిళ, ఒక బాలుడు, ఇంకా నలుగురు పురుషులు మరణించారు. వీరంతా ఆటో–రిక్షాలో ప్రయాణిస్తున్నవారే. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల వివరాలను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక విచారణలో తేలిన వివరాల ప్రకారం, ట్రక్కు అతివేగంతో ప్రయాణించడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం." అని ఖగారియా సదర్ డీఎస్పీ ముకుల్ రంజన్ తెలిపారు.

## గడువులోగా ప్రాజెక్టులు..

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. పోలవరం ఎడమ కాల్వ చంపావతి లింక్ పై అధ్యయనం చేయాలని, ఎంత ఖర్చవుతుందో అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలని, ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధార–నాగావళి–చంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలని తెలిపారు.మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలని, 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి వివాదాలూ లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలని, పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం ఉండాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి చేయాలని, పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చూడాలన్నారు. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలని, నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడాలని తెలిపారు. గోదావరి–కావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సిఎం అధికారులనుఆ దేశించారు.

**ఖరీఫ్ కు రైతులను సిద్ధం చేయాలి**

ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలని, నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేదని, తుపాన్ల ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేదని, పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చి సీజన్ ను ముందుకు తీసుకువచ్చేలా నిర్ణయాలు తీసుకున్నామ ని తెలిపారు. వాటర్ మేనేజ్‌మెంట్‌లో ఇది కీలకమైన అంశమన్నారు. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు జలధార, జలహారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం.. నేడు హతం!




దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్–అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి.

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది. కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమాలకు పెట్టింది పేరుగా ఈ పార్టి ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి. కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది. ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది. చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం. సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది. బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది. నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూటర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి. కమ్యూనిస్టు పార్టీలకు అనేక ఆంక్షలు ఉన్నా శ్రామికుల సమ్మెలు, రైతాంగ ఉద్యమాలలో పార్టీ గ్రూపులు పనిచేస్తూనే వస్తున్నాయి.

# పెరుగుతున్న వరి ఉత్పత్తి ..

# తరుగుతున్న పప్పు నూనె గింజలు

**- వ్యవసాయం మానవాళిని పోషించాలి - జీవవ్యవస్థలను నాశనం చేయకూడదు- మానవాళికి శాపంగా మారనున్న వరి ఉత్పత్తి పెరుగుదల - డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912**




భారతదేశ వ్యవసాయ రంగం ప్రస్తుతం ప్రమాదకరమైన మార్పులను ఎదుర్కొంటోంది. ప్రభుత్వాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న వరి ఉత్పత్తిని, బియ్యం చిరుధాన్యాల సాగు విస్తరణను విజయంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, పప్పుధాన్యాలు నూనెగింజల సాగులో జరుగుతున్న తీవ్రమైన తగ్గుదల ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యత, నేల ఆరోగ్యం ప్రజల పోషకాహార భద్రతకు నిశ్శబ్ద ముప్పుగా మారుతోంది. వ్యవసాయ ఉత్పాదకతలో సాధించిన విజయంగా కనిపిస్తున్నది వాస్తవానికి మానవాళికి శాపంగా మారే ప్రమాదం ఉంది. వరి ఉత్పత్తిని గరిష్ట స్థాయికి తీసుకెళ్లాలనే మోజు భారత వ్యవసాయాన్ని పర్యావరణ అసమతుల్యత వైపు నెడుతోంది. అధిక నీటి వినియోగం, రసాయన ఎరువుల అతివాడకం, ఒకే పంట సాగు విధానం, పంట వైవిధ్యం తగ్గిపోవడం వంటి అంశాలు భవిష్యత్ తరాలకు తీవ్రమైన ప్రభావాలను మిగుల్చే పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

### వరిపై పెరుగుతున్న మోజు

శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, వ్యవసాయ ఆర్థిక నిపుణులు వరి ఆధారిత వ్యవసాయం ప్రమాదకరమని పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ, భారత్ వరిపై ఆధారపడటాన్ని మరింతగా పెంచు కుంటోంది. తాజా వ్యవసాయ గణాంకాల ప్రకారం అనేక ప్రాంతాల్లో వరి సాగు అంచనాలను మించిపోయింది. తెలంగాణలో వరి సాగు అధికారిక లక్ష్యాలను దాటి దాదాపు 178 శాతం వరకు పెరిగింది. అదే సమయంలో చిరుధాన్యాల సాగు పెరిగినా, పప్పుధాన్యాలు నూనెగింజల సాగు తీవ్రంగా తగ్గిపోయింది. ఇది ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా రైతులు వరిని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణాలు ప్రభుత్వ కొనుగోలు హామీ, కనీస మద్దతు ధర, నీటి లభ్యత, తక్షణ మార్కెట్ డిమాండ్ రాజకీయ ప్రోత్సాహకాలు. మరోవైపు పప్పుధాన్యాలు నూనెగింజలకు స్థిరమైన మార్కెట్ లేకపోవడం, బలహీనమైన కొనుగోలు వ్యవస్థలు, ధరలు పతనం కావడం వంటి సమస్యలు ఉన్నాయి. జీవనోపాధి భద్రత కోసం రైతులు సహజంగానే వరి వైపు మొగ్గుచూపుతున్నారు. కానీ ఈ ఆర్థిక తర్కం చివరకు పర్యావరణ విపత్తును సృష్టిస్తోంది.

### వరి ఉత్పత్తి వెనుక దాగి ఉన్న నీటి సంక్షోభం

వరి ప్రపంచంలో అత్యధిక నీటిని వినియోగించే పంటలలో ఒకటి. ఒక కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3,000 నుంచి 5,000 లీటర్ల వరకు నీరు అవసరమవుతుంది. ఇప్పటికే భూగర్భజలాల కొరతను ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో నిరంతర వరి సాగు పర్యావరణ సంక్షోభాన్ని మరింత వేగవంతం చేస్తోంది. తెలంగాణ, తమిళనాడు, పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక నీటి వినియోగ వ్యవసాయం కారణంగా తీవ్రమైన భూగర్భజల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా నీటి వనరులు తగ్గిపోతున్న సమయంలో కూడా భారత్ మరింత వరి ఉత్పత్తి వైపు పయనించడం వ్యంగ్యంగా కనిపిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం 5 మిలియన్ హెక్టార్ల వరి సాగును తగ్గించి, జన్యు సవరణ సాంకేతికతతో అధిక దిగుబడులు సాధించాలని యోచిస్తోంది. దీన్ని సాంకేతిక విప్లవంగా ప్రచారం చేస్తున్నప్పటికీ, ఇది అనేక ఆందోళనలను రేకెత్తిస్తోంది.

### జీనోమ్ ఎడిటింగ్: శాస్త్రీయ పురోగతా? పర్యావరణ జూదమా?

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సాంకేతికతతో అభివృద్ధి చేసిన డిఆర్ఆర్ ధన్ 100 (కమల), పూసా డిఎస్టి రైస్ 1 వంటి కొత్త వరి రకాలను ప్రవేశపెట్టింది. ఈ రకాలు ఉత్పాదకతను పెంచుతాయని, నీటిని ఆదా చేస్తాయని, తక్కువ భూభాగంలో అధిక దిగుబడి ఇస్తాయని, వాతావరణ మార్పులకు తట్టుకుంటాయని అధికారులు చెబుతున్నారు. అయితే అనేక మంది శాస్త్రవేత్తలు జీనోమ్ ఎడిటింగ్ సాంకేతికతల భద్రతపై ఇంకా అనిశ్చితి ఉందని హెచ్చరిస్తున్నారు. సిఆర్ఐఎస్పిఆర్ ఆధారిత మార్పులు అనుకోని జన్యు సమస్యలు, పర్యావరణ ప్రభావాలను కలిగించే అవకాశముందని వారు భావిస్తున్నారు. అసలు ప్రశ్న ఏమిటంటే అధిక వరి ఉత్పత్తిని కొనసాగించడానికి మానవాళి జన్యుమార్పిడి పంటలపై ఎందుకు ఆధారపడాలి? సహజ వ్యవసాయ సమతుల్యతను పునరుద్ధరించాల్సిన సమయంలో ఆధునిక వ్యవసాయం ప్రకృతినే ఇంజినీరింగ్ చేయడానికి ప్రయత్నిస్తోంది.

### పప్పుధాన్యాలు, నూనెగింజల క్షీణత

వరి ఉత్పత్తి పెరుగుతున్న సమయంలో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు క్షీణిస్తోంది. ఇది అత్యంత ప్రమాదకరం. ఎందుకంటే పప్పుధాన్యాలు భారతదేశంలో కోట్లాది పేద మరియు శాకాహార కుటుంబాలకు ప్రధాన ప్రోటీన్ వనరు. నూనెగింజలు తినే నూనెల భద్రతకు కీలకం. భారత్ ఇప్పటికే భారీ స్థాయిలో వంటనూనెలను దిగుమతి చేసుకుంటోంది. దేశీయ నూనెగింజల సాగు తగ్గిపోతే దిగుమతులపై ఆధారపడటం మరింత పెరుగుతుంది. అలాగే పప్పుధాన్యాల సాగు తగ్గిపోవడం పోషకాహార భద్రత, నేల సారవంతం, నత్రజని సమతుల్యత, గ్రామీణ పంటల వైవిధ్యానికి ప్రమాదం కలిగిస్తోంది. వరి పంటతో పోలిస్తే పప్పుధాన్యాలు వాతావరణంలోని నత్రజనిని నేలలో స్థిరపరచి నేల సారాన్ని సహజంగా పెంచుతాయి. అవి రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. పప్పుధాన్యాల స్థానంలో వరిని ప్రోత్సహించడం వ్యవసాయ అభివృద్ధి కాదు --- అది పర్యావరణ వెనకడుగు.

### ఒకే పంట సాగుతో నేల నాశనం

నిరంతర వరి సాగు భారత నేలలను అలసటకు గురి చేస్తోంది. యూరియా, డిఏపి ఎరువులు, రసాయన పురుగుమందులు, వరద పద్ధతి సాగుపై అధిక ఆధారపడటం వల్ల నేల జీవ వైవిధ్యం దెబ్బతింది. అనేక వరి ప్రాంతాల్లో నేలలో సేంద్రీయ పదార్థం తగ్గిపోయింది. రైతులు ఒక ప్రమాదకర చక్రంలో చిక్కుకుపోతున్నారు. నేల సారం తగ్గి పోతుంది. మరింత ఎరువులు అవసరమవు తున్నాయి. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. నీటి అవసరం పెరుగుతోంది. పురుగులు మం దులకు ప్రతిఘటన చూపుతున్నాయి. దీని ఫలితంగా పర్యావరణ సహనశక్తి క్షీణిస్తోంది. ఒకప్పుడు ఆహార ఉత్పత్తిని పెంచిన గ్రీన్ రివల్యూషన్ మోడల్ ఇప్పుడు పర్యావరణ అలసట దశలోకి ప్రవేశించిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### చిరుధాన్యాలు: మానవాళి మరచిపోయిన భవిష్యత్తు

వాతావరణ మార్పులకు తట్టుకునే ఉత్తమ పంటలు ఇప్పటికే మన దగ్గరే ఉన్నాయి అవే చిరుధాన్యాలు,పప్పుధాన్యాలు. చిరుధాన్యాలకు చాలా తక్కువ నీరు సరిపోతుంది. తక్కువ ఎరువులు అవసరం. కరువు పరిస్థితుల్లో కూడా పెరుగుతాయి. పోషకాహారాన్ని మెరుగుపరుస్తాయి. వాతావరణ సంక్షోభాన్ని తగ్గించడంలో సహాయ పడతాయి. ప్రపంచ వాతావరణ సంక్షోభం, ఎరువుల కొరత, అనిశ్చిత మాన్సూన్ పరిస్థితులు ఇప్పుడు బజ్రా, జొన్న, రాగులు, పప్పుధాన్యాల ప్రాముఖ్యతను మళ్లీ గుర్తు చేస్తున్నాయి. చిరుధాన్యాలు పండించే రైతులు తక్కువ సాగు ఖర్చులు, తక్కువ పురుగుమందుల వినియోగం, వేగవంతమైన పంట చక్రాలు, అనిశ్చిత వర్షపాతం పరిస్థితుల్లో మెరుగైన అనుకూలతను గమనిస్తున్నారు. పత్తి లేదా వరితో పోలిస్తే చిరుధాన్యాలకు చాలా తక్కువ నీరు రసాయనాలు సరిపోతాయి. సుస్థిర వ్యవసాయం భవిష్యత్తు జన్యుమార్పిడి వరి పొలాల్లో కాదు; సంప్రదాయ, వాతావరణానుకూల వ్యవసాయ వ్యవస్థల పునరుద్ధరణలో ఉంది.

### వరి రాజకీయ ఆర్థిక వ్యవస్థ

వరి సాగు కొనసాగడం కేవలం వ్యవసాయ సమస్య కాదు అది రాజకీయ అంశం కూడా. ప్రభుత్వాలు వరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎందుకంటే ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలు బలంగా ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యంపై ఆధారపడి ఉంది. వరి కొనుగోలు ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. భారీ ఎరువుల పరిశ్రమలు కూడా వరి ఆధారిత సాగుతో లాభపడుతున్నాయి. ఈ విధాన పరమైన మొగ్గ పంట వైవిధ్యాన్ని నిరు త్సాహపరుస్తోంది. పప్పుధాన్యాలు నూనెగింజలకు ఎంఎస్పి పెంచినా, రైతులు వరి నుంచి మారడానికి వెనుకాడుతున్నారు. ఎందుకంటే వరిలా బలమైన కొనుగోలు వ్యవస్థలు వాటికి లేవు. భరోసా గల కొనుగోలు, నిల్వ మౌలిక సదుపాయాలు, మార్కెట్ స్థిరత్వం లేకుండా పంట వైవిధ్యం సాధ్యం కాదు.

పంట వైవిధ్యమే అసలైన ఆహార భద్రత ఆహార భద్రత అంటే గరిష్టంగా బియ్యం ఉత్పత్తి చేయడం కాదు. ఆరోగ్యకరమైన సమాజానికి పంట వైవిధ్యం, పోషక సమతుల్యత, నేల సంరక్షణ, నీటి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత అవసరం. ఒకే పంట అధిక ఉత్పత్తి ఇతర పంటల నాశనానికి దారితీస్తే అది మొత్తం వ్యవస్థను బలహీనపరుస్తుంది. చరిత్ర చెబుతోంది --- ఒకే పంటపై ఆధారపడిన నాగరికతలు నేల పతనం, పురుగు విపత్తులు, నీటి సంక్షోభాలు, పోషకాహార లోపాలు, ఆర్థిక అస్థిరతలను ఎదుర్కొన్నాయని. మానవ మనుగడ వ్యవసాయ పరిమాణంపై మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతపై ఆధారపడి ఉంటుంది. ముందుకు వెళ్లే మార్గంభారతదేశం తన వ్యవసాయ ప్రాధాన్యతలను అత్యవసరంగా పునరాలోచించాలి. వరి, పప్పుధాన్యాలు, నూనెగింజల మధ్య పంట మార్పిడి విధానాన్ని ప్రోత్స హించాలి. పప్పుధాన్యాలు మరియు చిరుధాన్యాల కొనుగోలు వ్యవస్థలను బలోపేతం చేయాలి. రసాయన ఆధారిత ఒకే పంట సాగును తగ్గించాలి. నేలలో సేంద్రియ కార్బన్ పునరుద్ధరణకు జాతీయ ప్రాధాన్యం ఇవ్వాలి. రైతులకు సుస్థిర వ్యవసాయం, నీటి పొదుపు సాంకేతికతలపై శిక్షణ అవసరం. స్థానిక వాతావ రణానుకూల విత్తనాలకు బలమైన మద్దతు కల్పించాలి. జన్యుమార్పిడి పంటలపై అధిక ఆధారపడటాన్ని కూడా పునరాలోచించాలి. యంత్రణ లేకుండా పెరుగుతున్న వరి ఉత్పత్తి ప్రస్తుతం ఆర్థికంగా లాభదాయకంగా కనిపి ంచవచ్చు. కానీ దీని దీర్ఘకాల ప్రభావాలు వినాశకరంగా మారే ప్రమాదం ఉంది. ఒక దేశ వ్యవసాయ విజయాన్ని అది ఎంత బియ్యం ఉత్పత్తి చేస్తుందనే దానితో కాకుండా, భూమి, నీరు, జీవ వైవిధ్యం, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని ఎంతవరకు రక్షిస్తుందనే దానితో కొలవాలి. స్వల్పకాలిక ఉత్పత్తి లాభాల కోసం మానవాళి పర్యావరణ సమతుల్యతను త్యాగం చేస్తూ కొనసాగితే, వరి ఉత్పత్తి పెరుగుదల నిజంగానే మానవాళికి శాపంగా మారవచ్చు.

## పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలి




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి సీపీఐ, పార్టీ ఆధ్వర్యంలో గుత్తి పట్టణం గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న పరమేశ్వరయ్య పెట్రోల్ బంక్ ఎదురుగా వినూత్న నిరసన కార్యక్ర మం.నిర్వహించడం జరిగింది.అనం తరం.మండల కార్యదర్శి రాందా సు,పట్టణ కార్యదర్శి రాజు,సీనియ ర్ నాయకులు రమేష్ బాబు,మహి ళా సమైక్య నియోజకవర్గ నాయకు రాలు మహమ్మద,మాట్లాడుతూ ఇ టీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రో ల్,డీజిల్,వంట గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలను వెంటనే ఉపసఓ భరించుకోవలాని.గుత్తి,పరమేశ్వర య్య పెట్రోల్ బంక్ ఎదురుగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వ హించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి రామ దాసు, పట్టణ కార్యదర్శి రాజు,ని యోజకవర్గ సీనియర్ నాయకులు రమేష్ బాబు,మండల సహయ కా ర్యదర్శి వెంకట రాముడు, పట్టణ సహకార దర్శిలు నజీర్, మహ్మదా, ఏఐటీయూసీ, అమాలి నాయకులు,వి నయ్, మల్లికార్జున, రమణ,దేవేంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు. నాగార్జున, ఆర్బి రామంజి, సీనియర్ నాయకులు డ్యానియల్, షఫీ, రామకృష్ణ భేస్తా శివకుమార్, మల్లికార్జున, గోపాల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు చెల్లించండి ఐదు శాతం డిస్కౌంట్ పొందండి




**యాడికి – సూర్య వాస్తవం :** మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని ప్రజలకు డిప్యూటీ ఎంపీడీవో శశికళ ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. ఇంటి పన్ను, కొళాయి పన్నులపై 5శాతం రాయితీ చివరి తేదీ ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలి. నెల చివరి వరకు వేచి చూడకుండా, ఈ లోపే పన్నులు చెల్లించి 5 శాతం డిస్కౌంట్ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో మండల ప్రజలను కోరు తున్నారు. గడువు ముగిసేలోపు మీ పరిధిలోని పంచాయతీ కార్యాలయంలో పన్నులు చెల్లించి రశీదు పొందాలని, మీ గ్రామాభివృద్ధిలో భాగస్వాములుకావాలని కోరారు.

## లత్తవరం కొండపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి మండల పూజ



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** స్థానిక మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి మండల పూజా కార్యక్రమం ఈనెల 21వ తేదీన జరగనుంది. కావున గ్రామ ప్రజలు, భక్తులందరూ ఈ మండల పూజా కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆయన కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమానికి భక్తులందరికీ ఇదే ఆహ్వానం. గ్రామ నాయకులు కొర్రపాటి మల్లికార్జున, బోధపాటి గోవిందప్ప, భోగేష్, తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారాలపై శక్తి టీం అవగాహన

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** శక్తి టీమ్స్ కార్యక్రమాన్ని సిబ్యాల గ్రామం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. శక్తి టీమ్స్ కార్యక్రమశీ అవగాహన గురించి సిబ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో పోలీసు డిపార్ట్మెంట్ పాల్గొని ఈ శక్తి టీమ్స్ గురించి సిబ్యాల గ్రామ ప్రజలకి వివరించారు. అలాగే అనుంపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ శక్తి టీమ్స్ ఈ మధ్యకాలంలో చిన్నపిల్లల పైన మరియు మహిళల పైన జరుగుతున్న అత్యాచారాలనుదృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వము శక్తి టీమ్స్ యాప్ నీ రూపొందించి దీనిని ప్రజలు ఉపయోగించు కోవాలని అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.. అలాగే సమాజంలో గంజాయి జూదము.. యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని... అటువంటివారు మన సమాజంలో ఉన్న పోలీసు వారికి తెలియజేసి పోలీసువారికి సహాయపడాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.




## సీఎం గారూ! ఇచ్చిన హామీలకే దిక్కులేదు

# మళ్ళీ వేలంపాట అవసరమా?

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ఇప్పటికే ఇచ్చిన హామీలకు దిక్కులేదు. ఈ పరిస్థితుల్లో మూడో బిడ్డ పుడితే 30,000 లు,నాలుగో బిడ్డ పుడితేరు రూ.40,000లు అని వేలంపాట పాడడం అవసరమా అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. సోమవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధానమని, దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా అందులో సగం హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని తులసి రెడ్డి అన్నారు. నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పబడింది ఇంతవరకు మూడు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఆడబిడ్డనిధి క్రింద 19-59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పబడింది. ఇంతవరకు అమలు కాలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పబడింది.ఇంతవరకు అతీగతీ లేదు. రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు లభించడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. వ్యవసాయం దండుగ అనే పరిస్థితి వుంది. ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉండిపోయాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉడికిపోతున్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు దాదాపు 10, 600 కోట్ల రూపాయలు ఉన్నాయి. కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక వేదనకు గురవుతున్నారు. దాదాపు 3 వేల కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నాయి. ఇచ్చిన హామీలను, పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించకుండా మూడో బిడ్డ పుడితేరు 30,000లు, నాలుగో బిడ్డ పుడితే రు 40,000 లు అని వేలం పాట పాడడం ఏమాత్రం సమంజసం కాదు. ముఖ్యమంత్రి పునరాలోచించాలి అని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుంది ముఖ్యమంత్రి వైఖరి అని ఎద్దేవా చేశారు.

## పవన్ కళ్యాణ్ వైసీపీని విమర్శించడం హాస్యస్పదం

**- కడప వైసీపీ యువజన విభాగ ఉపాధ్యక్షులు రహంతుల్లా ఖాన్**




**వేంపల్లె – సూర్య వాస్తవం :** పవన్ కళ్యాణ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడం హాస్యస్పదం అని రహమతుల్లా ఖాన్ అన్నారు. అతను మాట్లాడుతూ మీకు 2019 లో వచ్చింది ఒక సీటు, మీరు పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోయారు. అది మరచి పోయి మీరు మమ్మల్ని ఎగతాళి చేయడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు. పవన్ కళ్యాణ్ మాకు వచ్చింది 11 సీట్లు అయిన మావి ఒక కోటి 40 లక్షల గొంతుకలు అది గుర్తుపెట్టుకో అని ఎద్దేవా చేశారు. అతను మాట్లాడుతూ మరి గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయిన తర్వాత కూడా జగన్ మీద ఎంత ఆవేశంతో ఊగిపోయావో మర్చిపోయావా అన్నారు.సవ లచ్చా హామీలిచ్చి అన్ని పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు ప్రభుత్వం ఏర్పడి మూడవ సంవత్సరం జరుగుతా ఉంది ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు అంతా శూన్యం అన్నారు.పవన్ కళ్యాణ్ ఏమో పక్క రాష్ట్రంలో హీరో ముఖ్యమంత్రి అయితే మనకెందుకు ఊర్లో పెళ్లికి కుక్కల హడావిడి అని మీ అభిమానులను ఉద్దేశించి చెబుతున్నారు కానీ మీ అభిమానులేమో నిన్న ముఖ్యమంత్రి గామేము చూడాలనుకుంటే నువ్వు మమ్మల్ని కుక్కలతో పోలుస్తావా నీకో దండం అంటున్నారు అంటున్నారని గుర్తు చేశారు. 11 సీట్లు అంటూ మీరెంత అహంకార పూరితంగా మాట్లాడినా ప్రతిపక్షంగా ప్రజల తరపున మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాం.ముందు మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. లేదంటే ప్రజా తిరుగుబాటుకు తమిళనాడు ఎన్నికల్లో మాదిరి మీ కూటమి పార్టీ గాల్లో కలిసి పోవడం ఖాయమని రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు.

## కక్షలు మానండి.. ఆత్మీయంగా జీవిద్దాం..

**- మన బిడ్డల బంగారు భవితకు బాటలు వేద్దాం...**

**- ఎస్.ఐ ప్రవీణ్ కుమార్**



**వేముల – సూర్య వాస్తవం :** ఆత్మీయంగా జీవిద్దాం.. మన బిడ్డల బంగారు భవితకు బాటలు వేద్దాం అని వేముల ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి వేముల మండలంలోని పెద్ద జూటూరు గ్రామంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఫ్యాక్షన్ కక్షల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో 'మేలుకొలుపు' నాటక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ జి. నరసరామ్ బృందం గ్రామ ప్రజలకు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తూ, కక్షలకు దూరంగా ఉండి పిల్లలకు మంచి విద్య అందించాలని సూచించారు. అలాగే వ్యవసాయ రంగంలో ఆధునిక సేద్య విధానాలను అనుసరించి మంచి దిగుబడులు సాధించాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ పోక్సో చట్టం, పిల్లల భద్రత, బాల్య వివాహాల నివారణ, ఈవ్ టీజింగ్, డయల్-112 సేవలు, రహదారి భద్రత, సోషల్ మీడియా అండ్ సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులకు వివరించారు. కళాజాత బృందం ప్రదర్శించిన 'మేలుకొలుపు' నాటకం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకోగా, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## పురపాలక సంఘంలో 40కి పెరగనున్న వార్డుల సంఖ్య

**- అభ్యంతరాలు, సలహాలకు 7 రోజుల గడువు**

**- మున్సిపల్ కమిషనర్ సి.మునికుమార్**



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పురపాలక సంఘంలో వార్డుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 64 (తేదీ: 24.03.2026) ప్రకారం పురపాలక సంఘాలు,నగర పంచాయతీలలో ఎన్నికైన సభ్యుల సంఖ్యను (కౌన్సిల్ స్ట్రెంత్) సవరించారు. ఇందులో భాగంగా 60,000 దాటి 80,000 లోపు జనాభా ఉన్న పురపాలక సంఘాల కౌన్సిల్ సభ్యుల సంఖ్యను 40 కి పెంచాలని ప్రభుత్వం ఆదేశించిందని ?ఈ ఆదేశాల మేరకు గతంలో 33 వార్డులుగా ఉన్న పులివెందుల పురపాలక సంఘాన్ని ఇకపై 40 వార్డులుగా పెంచడం జరిగింది అని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి సర్క్యులర్ (Roc.No. 13032/2/2026/H1-2, తేదీ: 01.04.2026, 25.04.2026)కు లోబడి, జనాభా, ఓటర్ల సంఖ్య ప్రతిపాదికన ఈ విభజన ముసాయిదాను సిద్ధం చేశారని వార్డుల విభజనకు సంబంధించిన ఫారం-1 ను ప్రజల పరిశీలనార్థం పట్టణ పరిధిలోని పురపాలక సంఘ కార్యాలయం (మున్సిపల్ ఆఫీస్), అన్ని వార్డు సచివాలయాలు, ఆర్డీఓ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, అర్బన్ పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్, కోర్టు కార్యాలయం, మెప్మా కార్యాలయాల నోటీస్ బోర్డులలో అందుబాటులో ఉంచారన్నారు. ఈ ముసాయిదా వార్డు విభజన ప్రతిపాదనలపై ప్రజలకు ఏవైనా సూచనలు,సలహాలు లేదా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించవచ్చు అని మే 18, 2026 నుండి మే 24, 2026 సాయంత్రం 5:00 గంటల లోపు 7 రోజుల వ్యవధిలో తమ అభ్యంతరాలను పులివెందుల పురపాలక సంఘ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు.

## ట్రాఫిక్ సీఐగా జి.ప్రసాద్ రావు బాధ్యతల స్వీకరణ




**పులివెందుల అర్బన్ – సూర్య వాస్తవం:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పులివెందుల పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా జి.ప్రసాద్ రావు బాధ్యతలు చేపట్టారు.గతంలో విధులు నిర్వహిస్తున్న సీఐ శాంతి లాల్ రూరల్ (గ్రామీణ) సీఐగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పులివెందుల ట్రాఫిక్ సిఐగా జి.ప్రసాద్ సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ రావు మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని,ప్రజలకు ఎల్లప్పుడూ మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించేందుకు సిబ్బందితో కలిసి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.పట్టణ ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు, వాహనదారులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పోలీస్ అధికారులు,సిబ్బంది నూతన సీఐకి ఘనంగా స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్థికమంత్రి గారు వినపడవా మా ఆర్తనాదాలు

## - కేశవ తీర్చవా మా దాహార్తి



**వజ్రకరూరు – సూర్య వాస్తవం:** ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం, కొనకొండ్ల గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొనడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం, అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులు వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి సి పి వీరన్న ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే 'గ్రీవెన్స్' (స్పందన) కార్యక్రమంలో తమ బాధలను విన్నవించుకున్నారు. ఈ సమస్యకు త్వరగా పరిస్కారం మార్గం చూపాలని కలెక్టర్ కు వినతిపత్రం అందచేశారు.

**నెరవేరని ఎన్నికల హామీలు**

ఎన్నికల ప్రచారంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ తమ సమస్య తీరలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తీవ్రమైన ఆర్థిక భారం, విషాదం. గ్రామంలో నీరు లేకపోవడంతో రోజుకు 60 రూపాయలు పెట్టి ట్యాంకర్ల నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. ఇది నిరుపేద కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారంగా మారింది. తీవ్రమైన నీటి ఎద్దడి కారణంగా గత 10 రోజుల్లోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



విఫలమైన సత్యసాయి వాటర్ సప్లై వ్యవస్థ కొనకొండ్ల గ్రామంలో సత్యసాయి వాటర్ సప్లై ట్యాంక్ అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు నీరు అందడం లేదు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి గత 5-6 నెలలుగా జీతాలు రాకపోవడంతో, వారు గత 12 రోజులుగా ధర్నాకు దిగారు. వీరి సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ సమ్మె కారణంగా ఉమ్మడి జిల్లాలోని వందలాది గ్రామాలకు తాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో, ప్రభుత్వం త్వరగా స్పందించి నిధులు విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రముఖుల గ్రామంలోనే ఈ దుస్థితా?**

"స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 ఏళ్లు కావస్తున్నా కనీసం తాగడానికి నీరివ్వలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి. గుంతకల్ మున్సిపాలిటీకి సమీపంలో ఉన్న, మాజీ ఎమ్మెల్యే వై. శివరామిరెడ్డి సొంత గ్రామమైన కొనకొండ్లకే ఈ గతి పడితే... ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటి?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్థికమంత్రి సొంత ఇలాకాలోనే ఇలాంటి దారుణ పరిస్థితి ఉండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు స్పందించి, సత్యసాయి వాటర్ సప్లై సిబ్బంది జీతాల సమస్యను పరిష్కరించి, కొనకొండ్ల గ్రామానికి తక్షణమే తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జంబుద్వీప చక్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలి

## - జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్






**వజ్రకరూరు – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఉన్న చారిత్రక జైనుల జంబుద్వీప చక్రం ప్రస్తావన చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. కలెక్టర్ ఓ ఆనంద్ తీసుకున్న ఈ నిర్ణయం జిల్లా పర్యాటక రంగానికి, ముఖ్యంగా చారిత్రక వారసత్వ సంరక్షణకు ఎంతో దోహదపడుతుంది. పురావస్తు శాఖ జైన సంఘాల ప్రతినిధులతో కలిసి ఒక సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయడం. ఇక్కడికి వచ్చే పర్యాటకులు, పరిశోధకుల కోసం ప్రాథమిక సౌకర్యాలు, తాగునీరు, రవాణా కనెక్టివిటీని మెరుగుపరచడం. ఈ ప్రాంతం యొక్క విశిష్టతను, జైన మత చరిత్రను వివరించే బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులకు అవగాహన కల్పించడం. కొనకొండ్ల జంబుద్వీప చక్రం విశిష్టత?కొనకొండ్ల కేవలం ఒక గ్రామం కాదు, దక్షిణ భారతదేశంలోనే ఒకప్పుడు ప్రముఖ జైన మత కేంద్రంగా విరాజిల్లింది. జైన మతంలో అత్యంత పూజనీయులైన దిగంబర జైన ముని, తత్వవేత్త అయిన శ్రీ కుందకుందాచార్యుల వారు ఇక్కడే నివసించారని, ఇక్కడి నుంచే జైన మత వ్యాప్తి చేశారని చరిత్ర చెబుతోంది. కొండపై ఒక పెద్ద బండరాతిపై చెక్కబడిన ఈ చక్రం జైన కాస్మోలజీ ని ప్రతిబింబిస్తుంది. ఇది అత్యంత అరుదైన మరియు చారిత్రక విలువ కలిగిన కట్టడం. ఇటువంటి చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా మార్చడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాబోయే తరాలకు మన ప్రాచీన సంస్కృతి, చరిత్ర సజీవంగా అందుతాయి. ఈ ప్రణాళిక త్వరగా అమలులోకి వస్తే, అమరావతి లేదా లేపాక్షి తరహాలోనే కొనకొండ్ల కూడా ఒక ప్రముఖ చారిత్రక పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఇటువంటి చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా మార్చడం వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు (గైడ్లు, రవాణా, హోటళ్లు వంటివి) పెరుగుతాయి. అలాగే, మన ప్రాచీన సంస్కృతి, చరిత్ర రాబోయే తరాలకు సజీవంగా అందుతాయి.

# మ్యానిఫెస్టోలో హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పెట్రోలు, డీజిల్ ధరలు
- పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం
- ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించండి
- ఆర్డీవోకు వినతి పత్రం అందించిన వైసీపీ నాయకులు



**పులివెందుల – సూర్య వాస్తవం :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతూ ప్రజలను ఆర్థికంగా చిన్నభిన్నం చేస్తున్నాయని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని పులివెందుల ఆర్డిఓ చిన్నయ్యకు వైకాపా నాయకులు వినతి పత్రం అందించారు. ఇటీవల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు మరియు డీజిల్ ధరలను పెంచడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పులివెందుల వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పులివెందుల పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ మరియు ఇతర వైకాపా నాయకులు ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు వాహనాలను లాగుతూ పెంచిన ధరలను తగ్గించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలి వెళ్లి పెంచిన పెట్రోల్ మరియు డీజిల్ ధరలను తగ్గించాలని ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడం ఆందోళనకర విషయమని ఎన్నికలకు ముందు తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గిస్తామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి, దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధిక ధరలకు పెట్రోలు, డీజిల్ విక్రయించడం జరుగుతోందని, ఇప్పుడు తగ్గించడం బదులు మరింతగా పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై భారీ భారం మోపడంతో పాటు, రైతాంగం, రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కారణంగా పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెట్రోలు, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ పులివెందుల ఆర్డీవో కార్యాలయం నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వైకావి ాశ్రేణులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, ఎమ్మెల్సీ తిప్పేస్వామి



**మడకశిర – సూర్య వాస్తవం :** రొళ్ల మండలం కాకి గ్రామంలో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై ప్రజాప్రతినిధులు మరియు నాయకులు తక్షణమే స్పందించడం. గ్రామ ప్రజల కష్టాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ?సమస్య పరిష్కారానికి చొరవ తాగునీటి ఎద్దడిపై సమాచారం అందిన వెంటనే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మరియు రొళ్ల మండలం తెలుగుదేశం నాయకులు రంగంలోకి దిగారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య తీవ్రతను వివరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో నీటి కొరతను తీర్చడానికి వెంటనే బోర్లు వేయించేలా బోర్లారీని కాకి గ్రామానికి పంపించారు. కాకి గ్రామ ప్రజల తాగునీటి కష్టాలను అర్థం చేసుకుని, క్షణాల మీద స్పందించి సహాయం అందించిన ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం నాయకులకు కాకి పంచాయతీ, గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# రామాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



**చెన్నూరు– సూర్య వాస్తవం :** చెన్నూరు కొత్త గాంధీనగర్లో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని సోమవారం తహసీల్దార్ విజయకుమారి పరిశీలించారు. కొత్త గాంధీనగర్కు చెందిన కొంతమంది యువకులు రామాలయ నిర్మాణం కోసం తహసీల్దార్ను సంప్రదించగా, ఆమె వెంటనే స్పందించి స్థలాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థల విస్తీర్ణం, అందుబాటులో ఉన్న భూమి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బిజీ జీవితంలోనూ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

## -పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి



**చెన్నూరు– సూర్య వాస్తవం :** ఉద్యోగస్తులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ చాంద్ భాషా ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17 నుంచి 23 వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం, సమయానికి భోజనం, తగిన వ్యాయామం, క్రమం తప్పని వైద్య పరీక్షలు ఆరోగ్యాన్ని కాపాడుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**చెన్నూరు– సూర్య వాస్తవం :** ఆలంఖాన్ పల్లి సర్కిల్ వద్ద గుర్తు తెలియని సుమారు 25 సంవత్సరముల నుండి 35 సంవత్సరాల లోపు గల వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందినట్లు సీఐ చాంద్ భాషా తెలిపారు. మృతి చెందిన వ్యక్తి నీలం రంగు టి షర్ట్ జీన్స్ ప్యాంట్ ధరించి కుడి చేతి మీద కరీం సాహెబ్, మెహరున్నిసా కుడి మణికట్టు మీద టబు, ఎడమ చేతి మీద అబ్దుల్ ఖాదర్ అని పచ్చ బొట్టు వ్రాయబడి వున్నది. మరణానికి గల కరణములు తెలియాల్సి వున్నదని . కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మెడికల్ షాపుల బంద్ కార్యక్రమాలపై పునరాలోచించాలి

**- కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలం ధ్రువ కుమార్ రెడ్డి**



**పులివెందుల – సూర్య వాస్తవం :** మే 20వ తేదీ దేశ వ్యాప్తంగా మెడికల్ షాప్ లు నిరసన వ్యక్తం చేస్తూ బంద్ కు పిలుపునిచ్చే నిర్ణయాన్ని పునరాలోచించాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జ్ (సమన్వయకర్త) మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ మందుల అమ్మకాలు, భారీ డిస్కౌంట్లు, నకిలీ మం దులను నియంత్రించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు బందుకు పిలుపు నివ్వడాన్ని ఆయన ఆక్షేపిస్తూ బంద్ రోజు ప్రజలకు, రోగులకు మందులు అందుబాటులో లేక ఎన్ని ఇబ్బందులు పడుతారో ఓ సారి ఆలోచించాలని, బంద్ పాటించకుండా సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలే తప్ప ఇలా బంద్ పాటించడం సరికాదని ఆ రోజు రోగులకు మందులు దొరకకుండా ఎన్ని ఇబ్బందులు పడుతారో ఓ సారి ఆలోచించాలని, ఏ ఒక్కరికీ ఇబ్బంది కలిగిన కాంగ్రెస్ పార్టీ తరఫున ధర్నా నిర్వహించి వారి చర్యలను ప్రశ్నిస్తామని తెలియజేశారు.

## మే 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

**- ఈ-ఫార్మసీలకు వ్యతిరేకంగా ఔషధ వ్యాపారుల ఆందోళన**

**- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన చెన్నూరు కెమిస్టుల అసోసియేషన్**



**చెన్నూరు- సూర్య వాస్తవం :** ఈ-ఫార్మసీలకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్వహించనున్నట్లు చెన్నూరు కెమిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం చెన్నూరు తహసీల్దార్ విజయకుమారికి కెమిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాల వల్ల చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. భారీ డిస్కౌంట్లతో కార్పొరేట్ సంస్థలు మందులు విక్రయించడం వల్ల స్థానిక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నకిలీ మందుల విక్రయాలు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కఠిన నియంత్రణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో ప్రజలు అవసరమైన మందులను ముందుగానే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అయితే అత్యవసర ప్రాణరక్షక మందులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**తనకల్లు – సూర్య వాస్తవం :** శ్రీ సత్య సాయి జిల్లా మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన పేద ప్రజలు త్రాగునీటి సమస్యతో చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నారు, బూత్ కన్వీనర్ మహిళా అధ్యక్షురాలు తోట సరోజమ్మకు విన్నవించుకోవడం జరిగింది, తక్షణమే ఎమ్మెల్యే పార్టీ ఆఫీసుకు ఫిర్యాదు చేయగా తక్షణమే బోరు బండిని పంపించి తనకల్లులోని ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం రాత్రి తాగునీటి బోరు వేయించడంతో నాలుగు ఇంచులు నీళ్లు పడ్డాయి ఎన్టీఆర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్య తీరడంతో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కి కాలనీవాసులు, బూత్ కన్వీనర్ తోట సరోజమ్మ కృతజ్ఞత అభివందనాలు తెలియజేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం బసినేపల్లి గ్రామం దాటిన తరువాత పత్తికొండ రోడ్డు నుండి మైనాపురం గ్రామం పోయే రోడ్డు ప్రక్కన గల కొండేటి మల్లిఖా ర్జున ఎస్ /ఓ లేట్ చిన్న ఓబులేసు కు చెందిన పొలం వద్ద గల ట్రాన్స్ ఫారం వద్ద గల కంపచెట్లలో చనిపోయి వున్న ఊరు, పేరు తెలియని, సుమారు 30-45 సంవత్సరాల వయస్సు గల మగమనిషి 18.05.2026 వ తేదీ ఉదయం సుమారు 07:00 గంటల సమయం లో విషయం తె లు కొన్నాగుత్తి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది.చని పోయిన మగ మనిషి సుమారు 5' అడుగుల పొడవు వుండి,చామన చాయ రంగులో ఉంటాడు. ఆనవాలు పట్టుటకు గుర్తులు: 1.ఎడమ కంటి క్రింద చర్మం నల్లగా మచ్చ మాదిరి గా ఉండినది. 2.మూడు ఇంచులపొ డవు గల నలుపు,తెలుపు రంగుగల వెంట్రుకలు వుండి,సైడుకు చిన్నగా కటింగ్ చేయబడి ఉండినది.దుస్తు లు 1.ఆరంజ్ కలర్ పై నలుపు రంగు చుక్కలు డిజైన్ గల హాఫ్ షర్ట్,2. బూడిదరంగు లోయర్ ప్యాంటు 3. ఆకుపచ్చ రంగు షాట్ నిక్కర్ కల వు.ఆభరణాలు ఎలాంటి ఆభరణా లు లేవు.పై ఆనవాలు గల గుర్తు తెలియని మగ వ్యక్తి వివరాలు తెలిసిన యెడల గుత్తి పోలీస్ స్టేషన్ సీఐ 9346010582కి, ఎస్ఐ 9346917082కి తెలియజేయాలని గుత్తి పోలీసులు కోరారు.

# మడకశిరలో తీవ్ర ఉద్రిక్తత...!

**- సీఐ దురుసు ప్రవర్తనపై ఆగ్రహం**

**- పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన వందలాది మంది గ్రామస్తులు**



**- శ్రీ సత్యసాయి జిల్లా - సూర్య వాస్తవం :** మడకశిర నియోజకవర్గంలో తీవ్ర కలకలం రేగింది. అధికార పార్టీలోని అంతర్గత వర్గ విభేదాల నేపథ్యంలో పోలీసుల ప్రమేయం, ఓ సామాన్య వ్యక్తిపై సీఐ చేయి చేసుకోవడం మడకశిరలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా డి.అచ్చంపల్లి గ్రామస్తులంతా ఏకమై వందలాది మందితో మడకశిర పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ధర్నాకు దిగారు. అచ్చంపల్లి గ్రామంలో మారెమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామ ఉమ్మడి నిధులు (గ్రామస్వం)తో సాంప్రదాయ చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు ముందస్తుగా అనుమతి తీసుకున్నారు. అయితే, అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి చెందిన స్థానిక నాయకుల మధ్య గత కొంతకాలంగా వర్గ విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే చెక్కభజన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తమ పేర్లు వేయలేదని ఒక వర్గం నాయకులు తీవ్ర ప్రతిష్టకు పోయారు. తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. రాత్రి చెక్కభజన ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైన తరుణంలో.. మడకశిర సీఐ సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని దురుసుగా ప్రవర్తించారు. కార్యక్రమం ప్రారంభం కాకముందే అక్కడ ఉన్న ఒక వ్యక్తిపై సీఐ నిష్కారణంగా చేయి చేసుకుని, తీవ్రంగా కొట్టారు. సీఐ కొట్టిన దెబ్బకు ఆ వ్యక్తి అక్కడికక్కడే స్పృహ కోల్పోయి పడిపోయాడు. పవిత్రమైన గ్రామ ఉత్సవంలో పోలీసు అధికారి ఇలా బౌన్సర్ తరహాలో ప్రవర్తించడంతో



గ్రామస్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అన్యాయానికి గురైన తమ గ్రామస్థుడికి న్యాయం చేయాలంటూ డి.అచ్చం పల్లి గ్రామస్తులంతా ఒక్కటయ్యారు. అర్థరాత్రి వేళ పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా వందలాది మంది గ్రామస్తులు మరుపల్లి నుండి మడకశిర పోలీస్ స్టేషన్ వైపు దూసుకువచ్చారు. "సీఐ డౌన్ డౌన్... పోలీసుల అరాచకం నశించాలి" అంటూ భారీ నినాదాలతో పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఒక్కసారిగా వందలాది మంది జనం స్టేషన్‌ను చుట్టుముట్టడంతో ఏం చేయాలో పాలుపోక పోలీసులు చేతులెత్తేశారు. అధికార పార్టీ నేతల మాటలు విని పోలీసులు సామాన్యులపై ప్రతాపం చూపడం ఏంటని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం జరగాలని, దురుసుగా ప్రవర్తించిన సీఐ సుబ్రహ్మణ్యంపై తక్షణమే ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ముందే భీష్మించుకుని ధర్నా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మడకశిరలో పరిస్థితి ఉత్కంఠభరితంగా మారింది.

# మహిళల భద్రత - పోలీసుల ప్రథమ ప్రాధాన్యత

**- మహిళల రక్షణకు 'శక్తి యాప్ కవచం**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో... జిల్లాలోని ఐదు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న 'శక్తి టీమ్స్' సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారుల భద్రతపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలతో హోరెత్తించాయి. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కాలేజీలు మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో శక్తి టీమ్స్ విస్తృతంగా పర్యటించాయి. మహిళలు, యువతుల స్మార్ట్‌ఫోన్లలో 'శక్తి యాప్' లైవ్‌గా ఇన్‌స్టాల్ చేయించి, ఆపద సమయంలో దాన్ని ఎలా ఆపరేట్ చేయాలో ప్రాక్టికల్‌గా చూపించారు. రద్దీ ప్రదేశాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై, వేధింపులకు గురిచేసే వారిపై శక్తి టీమ్స్ నిరంతర నిఘా పెట్టాయి. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ కల్పిస్తున్న అత్యాధునిక సాంకేతిక సదుపాయాల గురించి వివరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే 'శక్తి యాప్' బటన్ నొక్కాలని లేదా 'డయల్ 100/ 112'కు కాల్ చేయాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే నిమిషాల వ్యవధిలోనే పోలీసులు మీ వద్దకు చేరుకుంటారని స్పష్టం చేశారు. సాంకేతికతతో కూడిన 'శక్తి యాప్' ప్రతి మహిళకు ఒక అదృశ్య రక్షణ కవచం లాంటిదని జిల్లా ఎస్పీ గారు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క మహిళ, విద్యార్థిని తమ ఫోన్లలో ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# కన్వర్షన్‌పై వెళ్తున్న పోలీస్ సిబ్బందికి సన్మానం





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** కుటుంబాలకు దూరంగా విధులు నిర్వర్తిస్తున్న బెటాలియన్ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని, వారిని సొంత జిల్లాలకు పంపే ఈ కన్వర్షన్ విధానానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. బెటాలియన్ సిబ్బంది వేలాది కిలోమీటర్ల దూరంలో డ్యూటీలు చేస్తూ, నెలకోసారి కుటుంబాలను కలిసే దుస్థితి నుంచి వారికి విముక్తి కల్పించేలా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అనంతపురంలోని 14 బేటాలియన్ లోని 9 మంది కానిస్టేబుల్లను అనంతపురం జిల్లాకు 6 మందిని, కడప, నంద్యాల, చిత్తూరు జిల్లాకు ఒక్కొక్కరు చొప్పున రిలీవ్ చేసిన సందర్భంగా కమాండెంట్ ప్రభుకుమార్ సిబ్బందికీ ఘనంగా సన్మానాలు చేసి వీడ్కోలు సమా వేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డిఎస్పీ మహబూబ్ బాషా , ఏవో నిజాముద్దీన్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు , బిడబ్ల్యు ఇంచార్జి నవీన్ కుమార్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, ఆఫీసర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ నిడివితో వస్తున్న చరణ్..

# 'పెద్ది' సెన్సార్ రిపోర్ట్ ఇదే!

**సెన్సార్ పూర్తి చేసుకున్న రామ్‌చరణ్ 'పెద్ది'**
**ఏకంగా 3 గంటల 9 నిమిషాల భారీ రన్‌టైమ్**
**సెన్సార్ యూనిట్ నుంచి అద్భుతమైన స్పందన**
**1980ల నాటి రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపకల్పన**
**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్**



మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'పై నెలకొన్న భారీ అంచనాల నడుమ ఒక ముఖ్యమైన అప్‌డేట్ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ సినిమా, తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి క్లియరెన్స్ లభించడమే కాకుండా, సినిమా రన్‌టైమ్‌పై కూడా స్పష్టత వచ్చింది. 'పెద్ది' చిత్రం ఏకంగా 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) భారీ నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సాధారణంగా నేటితరం కమర్షియల్ చిత్రాల నిడివి రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, దర్శకుడు బుచ్చిబాబు కథపై ఉన్న బలమైన నమ్మకంతో భారీ రన్‌టైమ్‌కే మొగ్గు చూపారు. 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివి ఉన్న సినిమా ఇదే కావడం విశేషం. కథలోని బలమైన భావోద్వేగాలు, నాటకీయత ప్రేక్షకులను ఆద్యంతం కట్టిపడేస్తాయని, ఎక్కడా కథనం నెమ్మదించిన ఫీలింగ్ కలగదని చిత్ర యూనిట్ ధీమాగా ఉంది. ఇటీవల 'పుష్ప 2', 'ధురంధర్ 2' వంటి భారీ చిత్రాలు మూడు గంటలకు పైగా నిడివితోనూ ఘన విజయం సాధించడంతో 'పెద్ది' రన్‌టైమ్ కూడా సినిమాకు ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.

ఈ సినిమా కథ 1980ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కింది. అప్పటి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడలు, మనుషుల మధ్య పంతాలు, పట్టింపుల చుట్టూ కథ నడుస్తుంది. ఈ పాత్ర కోసం రామ్‌చరణ్ పూర్తిగా డీ-గ్లామర్ లుక్‌లోకి మారిపోయారు. ఆయన శారీరక మార్పు, పడిన కష్టంపై సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వింటేజ్ బ్యాక్‌డ్రాప్, హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

'పెద్ది'లో చరణ్ వన్ మ్యాన్ షో.. క్లైమాక్స్ హైలైట్
ఇక, సెన్సార్ బృందం నుంచి 'పెద్ది' చిత్రానికి అద్భుతమైన స్పందన లభించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సినిమా చూసిన సభ్యులు దర్శకుడు బుచ్చిబాబు మేకింగ్‌ను, రామ్‌చరణ్ నటనను ప్రత్యేకంగా అభినందించారని సమాచారం. ముఖ్యంగా మూడు గంటల పాటు కథనం ఎక్కడా పట్టుసడలకుండా సాగిందని, క్లైమాక్స్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని సెన్సార్ టాక్ బలంగా వినిపిస్తోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై తాజా అప్‌డేట్స్‌తో అంచనాలు మరింత పెరిగాయి.

# ముహూర్తం కుదిరింది



చిరంజీవి మరోసారి సక్సెస్‌ఫుల్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలుపుతున్నారు. ప్రతిష్టాత్మక కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఈనెల 21న ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఈ ప్రకటనను చిరంజీవి స్వయంగా ఒక పవర్‌ఫుల్ జిమ్ వీడియో ద్వారా రివీల్ చేశారు. ఆ వీడియోలో ఆయన చూపించిన డెడికేషన్, ఇంటెన్స్ వర్కౌట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టం, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం చేస్తున్న ట్రైనింగ్ ఈ సినిమాలో ఉండబోయే హై-వోల్టేజ్ యాక్షన్‌కు హింట్ ఇస్తోంది. వీడియోలో మెగాస్టార్ మాట్లాడుతూ, 'గెట్టింగ్ రెడీ ఫర్ 158.. బాబీ.. ఈనెల 21 ముహూర్తం.. కెవిఎన్ ప్రొడక్షన్స్ వారిది..అంటే ఇంకో నాలుగైదు రోజుల్లో కలుస్తున్నాం. గెట్ రెడీ- అని తెలిపారు.

## శ్రీలీల-తిలక్ వర్మ డేటింగ్ రూమర్స్‌పై స్పందించిన హీరోయిన్ తల్లి



హైదరాబాద్ : టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల, టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె తల్లి స్వర్ణలత తెరదించారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె ఖరాఖండిగా తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కథనాల్లో అణువంత కూడా నిజం లేదని, ఇలాంటి పుకార్లు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పూర్తి స్పష్టతనిస్తూ స్వర్ణలత మాట్లాడుతూ.. "ప్రస్తుతం శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు చదువులపైనా పూర్తి దృష్టి పెట్టింది. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యపై ఏకాగ్రత చూపుతోంది. ముఖ్యంగా నీట్-పీజీ పరీక్ష కోసం సన్నద్ధమవుతోంది. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించే దశకు ఇంకా చాలా సమయం ఉంది. బహుశా మరో ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాతే ఆ విషయాలపై దృష్టి పెడుతుంది" అని వివరించారు.



# సన్‌రైజర్స్ రైట్ రైట్

- ప్లే ఆఫ్స్‌లోకి అడుగుపెట్టిన ఆరెంజ్ ఆర్మీ
- సూపర్‌కింగ్స్‌పై 5 వికెట్లతో ఘన విజయం
- చెన్నై 180/7, హైదరాబాద్ 181/5



చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఆరెంజ్ ఆర్మీ అదిరే పంచ్ ఇచ్చింది. ప్లే ఆఫ్స్‌లో రేసులో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో సూపర్‌కింగ్స్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఇషాన్ కిషన్ (70, 47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (47, 26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. మూడో వికెట్‌కు ఇషాన్, క్లాసెన్ 75 పరుగులు జోడించి సన్‌రైజర్స్ విజయానికి బాటలు వేశారు. మరో ఆరు బంతులు ఉండగానే లాంఛనం ముగించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్లో ఎనిమిదో విజయంతో ప్లే ఆఫ్స్‌లోకి ప్రవేశించింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 180 పరుగులు చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (44, 27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కార్తీక్ శర్మ (32, 19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ (3/28) మూడు వికెట్ల ప్రదర్శనతో సూపర్‌కింగ్స్‌ను కట్టడి చేశాడు. ఛేదనలో అర్ధ సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**ఇ'షాన్‌దార్' షో**

181 పరుగుల ఛేదనలో సన్‌రైజర్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ట్రావిశ్ హెడ్ (6) నిరాశపరచగా.. అభిషేక్ శర్మ (26, 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) తనదైన ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. ఓపెనర్ల నిష్క్రమణతో జతకట్టిన ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్‌లు మ్యాచ్‌ను సూపర్‌కింగ్స్ నుంచి లాగేసుకున్నారు. 41 బంతుల్లో 75 పరుగులు జోడించి సన్‌రైజర్స్‌ను ముందంజలో నిలిపారు. కిషన్ నెమ్మదిగా ఆడినా.. క్లాసెన్ దంచికొట్టాడు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. క్లాసెన్‌ను సంజు కండ్లుచెదిరే స్టంప్‌తో వెనక్కి పంపినా.. కిషన్ మెరుపులతో హైదరాబాద్ ముందంజ వేసింది. 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన కిషన్.. సలీల్ అరోరా (11 నాటౌట్) తోడుగా గెలుపు తీరాలకు చేర్చాడు. అభిషేక్ శర్మతో కలిసి 38 పరుగులు, నితీశ్ కుమార్ (11)తో కలిసి 22 పరుగులు, సలీల్ అరోరాతో కలిసి 22 పరుగులు జోడించిన ఇషాన్ కిషన్.. అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కిషన్ అవుటైనా.. రవిచంద్రన్ స్మరణ్ (5 నాటౌట్), సలీల్ లాంఛనం ముగించారు. 19 ఓవర్లలోనే 5 వికెట్లకు 181 పరుగులు చేసిన సన్‌రైజర్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సూపర్‌కింగ్స్ బౌలర్లలో ముకేశ్ చౌదరి (2/36), అన్షుల్ కాంబోజ్ (1/46), అకీల్ హుస్సేన్ (1/21) వికెట్లు పడగొట్టారు.

**మెరిసిన బౌలర్లు**

సొంతగడ్డపై టాస్ నెగ్గిన చెన్నై సూపర్‌కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సంజు శాంసన్ (27, 13 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రుతురాజ్ గైక్వాడ్ (15, 21 బంతుల్లో) అదిరే ఆరంభం అందించారు. శాంసన ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో దండెత్తాడు. ఆ తర్వాత ఉర్విల్ పటేల్ (13) వస్తూనే రెండు సిక్సర్లతో హడలెత్తించాడు. ఈ ఇద్దరి నిష్క్రమించినా.. కార్తీక్ శర్మ (32, 19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (44) జోరు కొనసాగించారు. బ్యాటర్లు ఎదురుదాడి చేయటంతో ఓ దశలో సూపర్‌కింగ్స్ 200 ప్లస్ పరుగులు చేస్తుందని అనుకున్నారు. కానీ క్రమంగా వికెట్లు పడగొట్టిన సన్‌రైజర్స్ బౌలర్లు.. సూపర్‌కింగ్స్‌ను స్వల్ప స్కోరుకు కట్టడి చేశారు. పాట్ కమిన్స్ మూడు వికెట్లతో మెరువగా.. సకిబ్ హుస్సేన్ (2/34) రెండు వికెట్లు పడగొట్టాడు. శివం దూబె (26, 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి నిరాశపరిచాడు. ప్రశాంత్ వీర్ (11) 9 బంతుల్లో రెండు ఫోర్లతో సూపర్‌కింగ్స్ స్కోరును 180 మార్క్‌కు చేర్చాడు. సూపర్‌కింగ్స్ బ్యాటర్లు ఎదురుదాడి చేసినా.. ఎటాకింగ్ బౌలింగ్‌తో వికెట్లు పడగొట్టిన సన్‌రైజర్స్ బౌలర్లు ఆకట్టుకున్నారు.

స్కోరు వివరాలు :
చెన్నై సూపర్‌కింగ్స్ : 180/8 (డెవాల్డ్ బ్రెవిస్ 44, కార్తీక్ శర్మ 32, సంజు శాంసన్ 27, పాట్ కమిన్స్ 3/28, సకిబ్ హుస్సేన్ 2/34)
సన్‌రైజర్స్ హైదరాబాద్ : 181/5 (ఇషాన్ కిషన్ 70, హెన్రిచ్ క్లాసెన్ 47, అభిషేక్ శర్మ 26, ముకేశ్ చౌదరి 2/36)



# రికీ పాంటింగ్ చూస్తుంటే బాధగా ఉంది: అశ్విన్

హైదరాబాద్ : ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రస్థానం దాదాపు ముగిసినట్టే. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఓటమితో ఆ జట్టు వరుసగా ఆరో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఓటమితో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమణ అంచున నిలిచింది. మ్యాచ్ అనంతరం డగౌట్‌లో హెడ్ కోచ్, దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ ఒంటరిగా, తీవ్ర నిరాశతో కూర్చున్న దృశ్యం అందరినీ కదిలించింది. ఈ ఫొటోపై టీమిండియా వెటరన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించాడు.

"ఈ టోర్నీలో టాప్-2లో నిలవాల్సిన జట్టు ఇలాంటి స్థితికి రావడం బాధాకరం. నేను 2018లో ఇదే కుర్చీలో కూర్చున్నాను. ఛాంపియన్ జట్లేవీ రెండు, మూడు హోం గ్రౌండ్‌లలో ఆడవు.

మొహాలీలో వరుసగా గెలిచి, మంచి ఊపు మీదున్న సమయంలో ధర్మశాలకు వచ్చి వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయారు. వారి ఓటమికి వారే కారణం" అని అన్నాడు. "మొహాలీ, ధర్మశాల పిచ్‌లకు పేస్, బౌన్స్ విషయంలో చాలా తేడా ఉంది. ఎత్తులో తేడా ఉండటంతో పిచ్ భిన్నంగా ప్రవర్తిస్తుంది. దీనివల్ల యువ ఆటగాళ్లు, విదేశీ ఆటగాళ్లు కూడా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

క్రికెట్ అవసరాల కన్నా వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ధర్మశాలలో ఒక్క మ్యాచ్ గెలిచినా ఇప్పుడు వారి పరిస్థితి వేరేలా ఉండేది.

ఈ పరిస్థితికి రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఎంతో బాధపడతారు. కానీ, గెలవాలనుకుంటే సొంత మైదానాన్ని వదిలి ఇలాంటి తప్పులు చేయకూడదు" అని అశ్విన్ ఘాటుగా వ్యాఖ్యానించాడు.

# ప్రజలకు వేగవంతమైన, సాంకేతికత, పారదర్శక పోలీస్ సేవలందించడమే లక్ష్యం

- శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి వంగలపూడి అనిత
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, జిల్లా యస్పీ యల్ సుబ్బరాయుడు
- రూ. 2.75 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో పోలీస్ స్టేషన్ నిర్మాణం
- భక్తుల భద్రత, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు
- సీసీటీవీ ఆధారిత ఆధునిక భద్రతా వ్యవస్థ ఏర్పాటు



**తిరుపతి,శ్రీకాళహస్తి – సూర్య వాస్తవం:**

శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తదితరులు సంయుక్తంగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే విధంగా రూ. 2.75 కోట్ల వ్యయంతో ఈ పోలీస్ స్టేషన్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లను ప్రజలకు మరింత చేరువగా, జవాబుదారీతనంతో పనిచేసే కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్'లో భాగంగా ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక చిన్న కేసు నుండి ప్రధాన కేసుల వరకు ప్రతి అంశాన్ని డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిశీలిస్తూ వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ జిల్లాలోనే "ది బెస్ట్" పోలీస్ స్టేషన్‌గా నిలుస్తుందని పేర్కొంటూ, భవన నిర్మాణంలో ప్రత్యేక చొరవ తీసుకున్న జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుని అభినందించారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ స్టేషన్లు అత్యాధునిక రూపాన్ని సంతరించుకుంటుండడం రాష్ట్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజలకు సైతం సులభంగా పోలీస్ సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డిజిటల్ డెస్క్ విధానం ద్వారా ఫిర్యాదుల నమోదు, కేసుల పర్యవేక్షణ, పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమైందన్నారు. రూ. 2.75 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనం ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించే విధంగా ఆధునిక ప్రమాణాలతో రూపొందించబడిందని పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ, 2008లో ప్రారంభమైన ఈ పోలీస్ స్టేషన్‌కు 2018లో శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సుమారు 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలో ఎస్‌హెచ్‌ఓ గది, మహిళల కౌన్సెలింగ్ రూమ్ సహా అన్ని విభాగాలను ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చే శ్రీకాళహస్తి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఆలయ పరిసరాలు, పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీటీవీ పర్యవేక్షణను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. శివరాత్రి వంటి భారీ ఉత్సవాల సమయంలో కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రముఖులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్‌కు 133 వినతులు



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా లో సోమవారం నాడు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్'లో స్వయంగా బాధితుల నుండి 133 వినతులు స్వీకరించారు ఎస్పీ పి. జగదీష్.అర్జీదారుల సమస్యలను ఓపికగా విని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులకు ఫోన్ మరియు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణ ఆదేశాలు జారీ చేశారు.? పీజీ ఆర్ ఎస్ కు విచ్చేసిన అర్జీదారులు మరియు వారి సహాయకుల సౌకర్యార్థం ఇస్కాన్ సంస్థ సహకారంతో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. మానవీయ కోణంలో అర్జీదారులకు, వారి కుటుంబ సభ్యులకు స్వయంగా భోజనాలు వడ్డించిన పోలీస్ అధికారులు. పోలీసుల సానుకూల స్పందన, ఆతిథ్యంపై ప్రజల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి

### - కలెక్టరేట్‌లో దివ్యాంగుడి ప్లకార్డు నిరసన



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాకు చెందిన పరమేష్ నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరాడు.అనంతపురంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వికలాంగుల కోటాలో నిరుపేద దివ్యాంగులకు ఉపాధి కల్పించాలంటూ ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశారు.దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే తాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధమని పరమేష్ హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని వికలాంగులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మరమ్మతులు మరిచిన హంద్రీనివా అధికారులు

### - ఆగమవుతున్న కాలువగట్లు



**ఉరవకొండ– సూర్య వాస్తవం :** హంద్రీనీవా ప్రధాన కాలువ ఉమ్మడి జిల్లాకు ఆయువు పట్టు. అయితే అక్కడక్కడ కొన్ని చోట్ల కాలువ దెబ్బతినింది. వాటికి అధికార యంత్రాంగం సకాలంలో మరమ్మతులు చేయిస్తే గట్లు పటిష్ఠం కానున్నాయి. వజ్రకరూరు మండలం రాగులపాడు పంపింగ్ కేంద్రం సమీపంలో నీటి ప్రవాహ ధాటికి రెండు చోట్ల కాలువ గట్టు మట్టి కొట్టుకుపోయింది. రాగులపాడు వంతెన సమీపంలో వంతెనకు ఇరువైపులా ఉన్న సిమెంటు కట్టడం, పూత కొంత ఊడిపోగా, మిగిలిన భాగం ప్రమాదకరంగా మారింది. కడమలకుంట సమీపంలో వంతెనకు ఆనుకుని ఉన్న సిమెంటు లైనింగ్ పూర్తిగా కూలిపోయింది. ప్యాపిలి సమీపంలో గట్టు ఎత్తుగా ఉండటం వల్ల వెనుకవైపు వరాలకు మట్టి జారిపోతోంది. ఉరవకొండ, లత్తవరం శివారులో కాలువ గట్టుపై కంప చెట్లు (పిచ్చి మొక్కలు) విపరీతంగా పెరిగిపోయి, రాకపోకలకు వీల్లేకుండా మారింది. చిన్నముష్టూరు సమీపంలో ఉప కాలువ వద్ద ప్రధాన గట్టుపై పెద్దపెద్ద నెర్రలు (చీలికలు) ఏర్పడి, గట్టు బలహీనపడింది. ప్రస్తుతం ఇవి చిన్న సమస్యలుగా కనిపించినప్పటికీ, కాలువకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసినప్పుడు నీటి ఒత్తిడికి గట్లు తెగిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, ముందే మరమ్మతులు చేపట్టాలి. హంద్రీనీవా ఈఈ శ్రీనివాసనాయక్ క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి, సమస్యలను గుర్తిస్తామని తెలిపారు. ఉన్నతాధి కారులతో చర్చించి, కాలువలోకి నీటి ప్రవాహం రాకముందే మరమ్మతు పనులను పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సాగునీరు సకాలంలో అందాలన్నా, వరద ముప్పు తప్పాలన్నా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే ఈ పనులను పూర్తి చేయడం అత్యంత కీలకం.

## రీసర్వే పై గ్రామసభ, అవగాహన ర్యాలీ



**మడకశిర–సూర్య వాస్తవం :**రత్నగిరి రెవిన్యూ గ్రామంలో ప్రజలకు రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామసభ, అవగాహన ర్యాలీని నిర్వహించారు. భూముల సర్వే ఎలా జరుగుతుంది, దీని వల్ల రైతులకు ,భూ యజమానులకు చేకూరే ప్రయోజనాల గురించి ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ, సర్వే శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.మండల తహశీల్దార్ చంద్రశేఖర్ , మండల సర్వేయర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప మండలంలోని గ్రామ సర్వేయర్లు , గ్రామ రెవిన్యూ అధికారులు అధికారులతో పాటు రత్నగిరి గ్రామ ప్రజలు, రైతులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని, రీ సర్వే ప్రాజెక్టుపై తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సర్వే ద్వారా గ్రామాల్లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## మతిస్థిమితం లేని వ్యక్తి ఆకలి తీర్చి...!

### - మానవత్వం చాటుకున్న తలారి పెద్దయ్య, జయకుమార్

**అనంతపురం – సూర్య వాస్తవం :** ఆకలితో అలమటిస్తున్న నిస్సహాయుడికి, మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తికి అన్నం పెట్టి ఆకలి తీర్చి గొప్ప మానవత్వం చాటుకున్నారు. పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తలారి పెద్దయ్య, మెడికల్ రెప్ జయకుమార్. సోమవారం నాడు అనంతపురం పట్టణంలోని స్థానిక శ్రీకంఠం సర్కిల్ లో రోడ్డు పక్కన ఆశ్రయం లేని మతిస్థిమితం లేని యాచాకుడు తిండి తినక దీన స్థితిలో ఉన్నాడని తెలుసుకొని అన్నం, నీళ్లు అందించారు.ఈ సందర్భంగా పలువురు పట్టణవాసులు వారి సేవా నిరతిని అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

### - ప్రజాదర్బార్ నిర్వహించిన బీటెక్ రవి



**పులివెందుల – సూర్య వాస్తవం :** పారదర్శకతతో కూడిన సత్వర పరిష్కారాలను అందిస్తామని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని పులివెందుల టిడిపి కార్యాలయంలో బీటెక్ రవి నేతృత్వంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరిగింది. పులివెందుల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ను సావధానంగా విని, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దీనికోసం ప్రభుత్వం అనేక ప్రత్యేక కార్యక్రమాలను, హెల్ప్‌లైన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేద న్నారు. పారదర్శకతతో కూడిన సత్వర పరిష్కారాలను అందిస్తున్నామ న్నారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )